నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

నిజాంపేట్‌: మియాపూర్‌ ఎక్స్‌ రోడ్డు సబ్‌స్టేషన్‌ 11కేవీ కొత్త కాలనీ ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌ ఏఈ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు న్యూ కాలనీ, లక్ష్మీ నగర్‌, నరేన్‌ గార్డెన్స్‌, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు లక్ష్మీ నగర్‌, దోవా కాలనీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

చింతల్‌లో...

చింతల్‌: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఆయా సబ్‌ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్‌ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ న్యూ బోయిన్‌పల్లి సబ్‌స్టేషన్‌ సీతారాంపురం లీడర్‌ పరిధిలో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు సీతారామపురం, గణేష్‌ కాలనీ, మర్రి రామిరెడ్డి కాలనీ, యాదవ బస్తీ, ఓల్డ్‌ కల్యాణి థియేటర్‌ ఏరియా, బృందావనం కాలనీ, సిండికేట్‌ బ్యాంక్‌ కాలనీ, ఐస్‌ ఫ్యాక్టరీ, న్యూ బోయిన్‌పల్లి సబ్‌ స్టేషన్‌ సాయిబాబా టెంపుల్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 గంటల వరకు సాయి దర్శన్‌ అపార్ట్‌మెంట్స్‌, జయనగర్‌ ఫేస్‌–1, సాయికృప అపార్ట్‌మెంట్స్‌, ద్వారకామయి అపార్ట్‌మెంట్స్‌, చిట్టారెడ్డి కాలనీ, నూతన్‌ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

బోనాల పండుగ నిధులు మంజూరు

జగద్గిరిగుట్ట: ఆషాఢమాస బోనాల సందర్భంగా పలు బస్తీలలో నెలకొన్న ఆలయాలు, పరిసర ప్రాంతాల్లో మరమ్మతుల కోసం కూకట్‌పల్లి జోన్‌కు రూ. 25 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా జంట సర్కిళ్లకు(కుత్బుల్లాపూర్‌ గాజులరామారం) సుమారు రూ. 6 లక్షలు కేటాయించారు. రంగారెడ్డి నగర్‌ డివిజన్‌కు రూ.60 వేలు, సుభాష్‌ నగర్‌ డివిజన్‌కు రు.67 వేలు, కుత్బుల్లాపూర్‌ డివిజన్‌కు రూ.75 వేలు, జీడిమెట్ల డివిజన్‌కు రూ.85 వేలు, గాజులరామారం, జగద్గిరిగుట్ట డివిజన్‌లకు రూ.1.60 వేలు, చింతల్‌, సూరారం డివిజన్‌లకు రూ.1.40 లక్షలు మంజూరు కావడంతో త్వరలోనే పనులు ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు.

ఫిట్‌నెస్‌ లేని బస్సులు సీజ్‌



వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్టీవో అధికారులు

కుత్బుల్లాపూర్‌: ఫిట్‌నెస్‌ సరిగ్గా లేని పలు బస్సులను మేడ్చల్‌ ఆర్టీవో అధికారులు సీజ్‌ చేశారు. జిల్లా రవాణా అధికారి రఘునందన్‌ గౌడ్‌ ఆదేశాలతో గురువారం కొంపల్లి, సుభాష్‌ నగర్‌ పైపులైన్‌ రోడ్డు, జీడిమెట్ల చౌరస్తా, పేట్‌ బషీరాబాద్‌ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఫిట్‌నెస్‌ సరిగ్గా లేకుండా, సరైన పత్రాలు చూపించకుండా తిరుగుతున్న ఐదు బస్సులను గుర్తించి సీజ్‌ చేశారు. మొత్తం నియోజకవర్గ పరిధిలోని ఐదు స్కూల్‌ లకు సంబంధించిన వాహనాలను మేడ్చల్‌ కార్యాలయానికి తరలించారు. మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌ శిల్ప, అసిస్టెంట్‌ మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్లు త్రివేణి, మహేష్‌, చంద్రశేఖర్‌, సిబ్బంది గంగాధర్‌, శ్రీకాంత్‌ రెడ్డి, మహేష్‌, పాషా, పాండు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

జగద్గిరిగుట్ట : హెల్పింగ్‌ హార్ట్స్‌ సొసైటీ తుటే విజయ్‌ కుమార్‌ ఆధ్వర్యంలో గురువారం డాక్టర్‌ సత్యనారాయణ జన్మదినం సందర్భంగా అశోక చక్ర దివ్యాంగుల సంక్షేమ సంఘంలో సరుకులు అందజేశారు. కార్యక్రమంలో బషీర్‌ బాగ్‌ సీసీఎస్‌ ఏసీపీ కిరణ్‌ కుమార్‌, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు ఏసుబాబు, దరువు అంజన్న, పద్మజ హాస్పిటల్‌ డాక్టర్‌ మధురిమ, కుమార్‌, హైకోర్టు లాయర్‌ సంజన, మాధవాచారి, కనకాచారి, రామాచారి, మహేంద్ర ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



భారతి జైన్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మల్లారెడ్డి

కుత్బుల్లాపూర్‌: విద్యావేత్త భారతీ జైన్‌ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు ఎస్‌.మల్లారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా ఐటీ సెల్‌ సోషల్‌ మీడియా కన్వీనర్‌ సతీష్‌ రంగంపేట, అసెంబ్లీ ఐటీ సెల్‌ సోషల్‌ మీడియా కన్వీనర్‌ సాయి జైవంత్‌ పాల్గొన్నారు.



అడ్మిషన్ల కోసం వేచి చూస్తున్న విద్యార్థులు



సూరారం నార్త్‌ సిటీ హైస్కూల్‌లో విద్యార్థులకు స్వాగతం పలుకుతూ..

మోగిన బడి గంట

- ఉత్సాహంగా హాజరైన విద్యార్థులు
- పాఠశాలల్లో పుస్తకాలు పంపిణీ



జీడిమెట్ల జడ్పీ హెచ్‌ఎస్‌ స్కూల్‌లో ప్రార్థనలో పాల్గొన్న విద్యార్థులు

కుత్బుల్లాపూర్‌ : వేసవి సెలవులు ముగియడంతో నూతన విద్యా సంవత్సరం గురువారం ప్రారంభమైంది. నిన్నటి వరకు వేసవి సెలవులతో గడిపిన విద్యార్థులు ఉదయాన్నే పాఠశాలలకు హాజరయ్యారు. తోటి విద్యార్థులతో కలిసి ఉల్లాసంగా గడపిపారు. పాఠశాల తొలిరోజు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. జడ్పీ హెచ్‌ఎస్‌ కుత్బుల్లాపూర్‌ పాఠశాలలో నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు కమల్‌సింగ్‌ స్వాగతం పలికారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీడిమెట్ల పోలీస్‌ స్టేషన్‌ సీఐ మల్లేశం విచ్చేసి విద్యార్థులకు పెన్నులు అందజేశారు. ప్రార్థన సమయంలో విద్యార్థులకు పలు నియమాలు, సూచనలు అందించారు. అనంతరం కమల్‌ సింగ్‌ అధ్యక్షతన ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. తొలిరోజు అడ్మిషన్ల కోసం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు స్వాగతం పలికారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేత



పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న హెచ్‌ఎం నాగేశ్వరి తదితరులు

రంగారెడ్డినగర్‌: చదువుతో పాటు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేలా పాఠాలు బోధిస్తున్నామని గాంధీనగర్‌ జడ్పీహెచ్‌ఎస్‌ ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగేశ్వరి అన్నారు. గురువారం పాఠశాల ప్రారంభం సందర్భంగా వివిధ తరగతుల విద్యార్థులకు కొత్త పాఠ్య పుస్తకాలు అందజేశారు. మొదటి రోజు 11 అడ్మిషన్లు జరిగాయని, పెద్ద సంఖ్యలో విద్యార్థులు చేరేలా బడిబాటలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘునందన్‌రావు, మహిపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌, కోకిలాంబ తదితరులు పాల్గొన్నారు.

టెలిఫోన్‌ అడ్వైజరీ కమిటీ మెంబర్‌కు సన్మానం



నిజాంపేట్‌: డాక్టర్‌ అద్దంకి స్వామిదాస్‌ రంజిత్‌ ఓఫీర్‌ టెలి కమ్యూనికేషన్స్‌ ఆఫీస్‌, ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర టెలిఫోన్‌ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం నిజాంపేట్‌ గ్రౌండ్స్‌లో రంజిత్‌కు పౌర సన్మానం చేశారు. పలువురు అభినందనలు తెలియజేస్తూ సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డా.రంజిత్‌ మాట్లాడుతూ.. ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో చాగంటి పాటి జాన్‌ వెస్లీ, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంత్‌రెడ్డి



హన్మంత్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న కాలనీల ప్రజలు

నిజాంపేట్‌ : ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయల కల్పనకు ఎల్లవేళలా కృషి చేస్తానని కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంత్‌రెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని బాచుపల్లి కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో వివిధ కాలనీ, బస్తీ ప్రజలు కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి వీలైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నాణ్యతతో పనులు పూర్తి చేయాలి

మూసాపేట: బాలాజీనగర్‌ డివిజన్‌ పరిధిలోని వివేక్‌నగర్‌లోని హిందూ శ్మశాన వాటికలో డ్రైనేజీ లైన్‌, అభివృద్ధి పనులను మాజీ కార్పొరేటర్‌ పగుడాల బాబూరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వివేక్‌నగర్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు ముత్యపాట శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శి అనిల్‌ కుమార్‌, రవీందర్‌, బాలకృష్ణ, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

21న యోగా డే వేడుకలు

కూకట్‌పల్లి: యోగా దినోత్సవ వేడుకలకు హాజరవ్వాలని గురువారం ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వానం అందజేశారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో ఈ నెల 21న యోగా డే సందర్భంగా ఉదయం 5:30 గంటలకు కూకట్‌పల్లిలోని ఎస్‌కెఎస్‌ఆర్‌ గార్డెన్స్‌లో 2 వేల మందితో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో జాప్యమెందుకు?

బాలానగర్‌: నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో జాప్యం తగదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఫతేనగర్‌ డివిజన్‌లోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై కార్పొరేటర్‌ పండాల సతీష్‌గౌడ్‌, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భరత్‌నగర్‌ నాలా పనులు పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ వాసులకు ఇబ్బంది లేకుండా ఉన్న స్థలంలోనే నాలా విస్తరణ పనులు చేపట్టాలని, అవసరమైతే కుడి పక్కన ఉన్న స్థలాన్ని సేకరించి పనులు చేపట్టాలని అధికారులకు తెలిపారు. ప్రజలను ఇబ్బందులు పెట్టవద్దని సూచించారు. అనంతరం ఫతేనగర్‌లోని ప్రధాన సమస్య అయిన ఫ్లై ఓవర్‌ వద్ద పర్యటించారు. స్థానిక ప్రజలు సమస్యలు తెలుసుకున్నారు. మార్కెట్‌ ధరకు అధికంగా నష్ట పరిహారం అందించాలని కోరారు. గతంలో బాలానగర్‌ ఫ్లై ఓవర్‌ నిర్మాణంలో ఈ విధంగానే చేశామని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్‌ పాలనలో బాలానగర్‌ ఫ్లై ఓవర్‌ను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని గుర్తు చేశారు. ఫతేనగర్‌ ఫ్లై ఓవర్‌ పనులు జాప్యం చేస్తే ప్రజలకు అండగా నిలబడడానికి ధర్నా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులతో పాటు బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

స్థలాల అమ్మకం నిధుల్లో..
అభివృద్ధికి కొంతైనా కేటాయించాలి

కూకట్‌పల్లి: హౌసింగ్‌ బోర్డులోని స్థలాలు అమ్మడం ద్వారా వచ్చిన రూ.142 కోట్లలో కొంతైనా నియోజకవర్గ అభివృద్ధికి కేటాయించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏ రోజైనా ప్రజలకు ఉపయోగపడే విధంగానే ముందుకు వెళ్లాం కానీ ఇలా స్థలాలు అమ్మి సొమ్ము చేసుకోలేదని గుర్తు చేశారు. ఏదైనా ఖాళీ స్థలం ఉంటే ప్రజలకు ఉపయోగపడే పార్కులు కానీ కమ్యూనిటీ హాల్స్‌, శ్మశాన వాటికలు, స్కూల్స్‌, ఆలయాలు, చర్చి, మసీదు, క్రీడా ప్రాంగణాలుగా తీర్చిదిద్దేవారమని చెప్పారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చినా హైదరాబాద్‌లో ఈ విధంగానే స్థలాలు అమ్ముకోవడం, సొమ్ము చేసుకోవటం తప్ప మంచి చేయాలని ఆలోచన ఉండదన్నారు.

గంటలోనే ఆచూకీ కనుక్కొని.. తల్లిదండ్రులకు అప్పగింత



జగద్గిరిగుట్ట: తప్పిపోయిన ముగ్గురు బాలురుల ఆచూకీని గంటలోనే కనుక్కొని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం.. లెనిన్‌ నగర్‌కు చెందిన సాయి (9) 8 గంటల ప్రాంతంలో తన తండ్రి రాజు దగ్గర డబ్బులు తీసుకొని ఇంటి తన సోదరులు భరత్‌ కుమార్‌ (6), కుషాంత్‌ (3)లతో కొనడానికి షాపుకి వెళ్లాడు. ఎంతకీ రాకపోవడంతో తండ్రి చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించారు. సీఐ నర్సింహ ఆధ్వర్యంలో పోలీసులు 3 బృందాలుగా విడిపోయి సీసీ కెమెరాల ఆధారాలతో రోడా మేస్త్రీ నగర్‌పైపు వెళ్లినట్లు కనుగొన్నారు. బట్టల షాపులో ఉన్న ముగ్గురిని పోలీసులు తీసుకువెళ్లి తల్లిదండ్రులకు అప్పగించారు.

రోడ్డును ఆక్రమించి..



జీడిమెట్ల: రోడ్లను అక్రమించి వ్యాపారాలు చేస్తే వాహనాల రాకపోకలు సాగించేదెలా అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. రోడ్లపై వేసిన ప్లాస్టిక్‌ సంచులను తొలగించాలని కోరితే సదరు వ్యాపారులు దాడికి వస్తున్నారు. రోడ్లపై ఉన్న ప్లాస్టిక్‌ను తీయించాలని అధికారులను కోరితే అసలు వారు చెవిన పెట్టడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీడిమెట్ల ఎస్వీ కో ఆపరేటీవ్‌ సొసైటీ నుంచి ఫాక్స్‌సాగర్‌ వెళ్లే రోడ్డులో కొంతమంది స్క్రాప్‌ వ్యాపారులు రోడ్లపై ప్లాస్టిక్‌ తుక్కు సంచులను డంప్‌ చేస్తున్నారు. నెలల తరబడి అలాగే సంచులను రోడ్లపై వేస్తుండటంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ఒక్కోసారి వాహనాలు ఎదురెదురుగా వచ్చినపుడు అటూ ఇటూ పోలేక రోడ్లపై జాం అవుతున్నాయని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సొసైటీ అధికారులు స్పందించి రోడ్ల స్థలాలపై ప్లాస్టిక్‌ తుక్కు సామానుల సంచులు తొలగించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

నేడు విద్యుత్‌ వినియోగదారుల పరిష్కార వేదిక

చింతల్‌: విద్యుత్‌ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి వినియోగదారుల పరిష్కార వేదిక శుక్రవారం ఏర్పాటు చేయనున్నట్లు బోయిన్‌పల్లి డివిజనల్‌ ఇంజినీర్‌ గోపాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ పరిష్కార వేదికలో వినియోగదారులు పాల్గొని అక్కడికక్కడే తమ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. సుదీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలు, సాంకేతిక సమస్యలు, బిల్లుల హెచ్చుతగ్గుల సమస్యలు, ప్యానెల్‌ బోర్డు సమస్యలు, నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, కొత్త మీటర్ల ఏర్పాటులో అధికారులు, సిబ్బంది వేధింపులు, అక్రమ విద్యుత్‌ కనెక్షన్లపై నివేదికలు వంటి అనేక సమస్యలపై అధికారులు పరిష్కార వేదికలో వినియోగదారులు అందజేయవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్‌ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పరిష్కార వేదిక ద్వారా వినియోగదారుల సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కారం అవుతాయని, అవకాశం ఉంటే అక్కడికక్కడే వారి సమస్యలను పరిష్కరించే వెసులుబాటు సైతం ఉంటుందని తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి



కుత్బుల్లాపూర్‌: రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌ రెడ్డి, ఉపాధ్యక్షులు రాజిరెడ్డి అన్నారు. బీజేపీ కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు సతీష్‌సాగర్‌ అధ్యక్షతన మున్సిపాలిటీ నూతన కార్యవర్గాన్ని గురువారం నియమించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు సరితారావు, ఎన్నికల ప్రభారి ప్రీతం రెడ్డి, కౌన్సిల్‌ సభ్యులు జనార్ధన్‌ రెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్‌ శివాజీ రాజు హాజరై దిశా నిర్దేశం చేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సన్మానించి నియామక పత్రాలను అందజేశారు.

నూతన కార్యవర్గం

బీజేపీ కొంపల్లి పట్టణ ఉపాధ్యక్షులుగా బూరుగుబావి దుర్గా, సూర్య ప్రకాష్‌ రావు, మహేశ్వర్‌ రెడ్డి, ఆకుల శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శులుగా పల్లికొండ మధు, బూర్గుబావి నర్సింగ్‌ రావు, కార్యదర్శులుగా, మురళీ కృష్ణ, భారతి, లత మహేశ్వరి, ముత్యాల శ్రీకాంత్‌, దుర్గం కుమార్‌ గౌడ్‌, కోశాధికారిగా ఉప్పరి మహేందర్‌ సాగర్‌, కార్యవర్గ సభ్యులుగా బూర్గుబావి మహేష్‌, కె. మహిపాల్‌ రెడ్డి, కె. భాస్కర్‌ రాజు, సి.హెచ్‌. చంద్ర శేఖర్‌ రెడ్డి, ఆర్‌. మధుసూదన్‌ రెడ్డి, భూపాల్‌ రెడ్డి, భాస్కర్‌, శ్రీశైలం, చంద్రశేఖర్‌, సందీప్‌ కుమార్‌, శివాజీ కిరుబోలె, జయనూరి ప్రకాష్‌, సంజీవ రెడ్డి, శైలజ, గోపాల్‌ రెడ్డి, రామిరెడ్డి, జగదీష్‌, రాఘవేందర్‌, నాగరాజు, శ్రీకాంత్‌ రెడ్డి, శివులు, హర్షవర్ధన్‌ వర్మ నియమితులయ్యారు.

బస్‌బేలోకి బస్సులు రావు!

రోడ్డుపైనే ప్రయాణికులు ఆగచాట్లు



షాపూర్‌రైతు బజారు ఎదురుగా బస్‌ షెల్టర్‌ బస్‌ బేలో కాకుండా రోడ్డుపైనే ఆపిన బస్సు

రంగారెడ్డినగర్‌: బస్‌షెల్టర్లు ఉన్నా బస్‌బేలోకి ఆర్టీసీ బస్సులు ఆగకపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు.. షాపూర్‌నగర్‌ రైతు బజారు ఎదురుగా ప్రధాన రోడ్డుపైనే బస్సులను నిలుపుతుండటంతో ప్రయాణికులకు బస్‌షెల్టర్‌ ఉన్నా లేకున్నట్లే ఉంది. షాపూర్‌నగర్‌ రైతు బజారు ఎదురుగా ప్రయాణికుల సౌకర్యార్థం లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. బస్‌బేను సైతం బీటీ రోడ్డుతో జీహెచ్‌ఎంసీ అధికారులు అందుబాటులోకి తెచ్చారు. అయినా ఆర్టీసీ డ్రైవర్లు మాత్రం రద్దీగా ఉండే రోడ్డుపైనే బస్సులను ఆపుతున్నారు. దీంతో ఎండలో నిలబోలేక, వర్షంలో తడవలేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి రన్నింగ్‌లోనే బస్సు దిగాల్సి వస్తోందని వృద్ధులు, మహిళా ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత ఆర్టీసీ అధికారులు స్పందించి బస్‌బే లో బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జీవనోపాధి కోసం నగరానికి..



సుభాష్‌నగర్‌: నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో శివారు ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గంలో ఐదు సంవత్సరాలలో నిర్మాణ రంగం మరింత అభివృద్ధి చెందింది. దీంతో పాటు ఇతర రాష్ట్రాలైన బిహార్‌, ఛత్తీస్‌గఢ్‌, ఉత్తర ప్రదేశ్‌, ఒరిస్సా రాష్ట్రాల నుంచి నిత్యం వందలాది మంది కార్మికులు ఇక్కడికి వస్తున్నారు. నిర్మాణ రంగంలో ఎక్కడ చూసినా ఆ రాష్ట్రాలకు చెందిన కార్మికులదే పైచేయి అని చెప్పవచ్చు. గురువారం జీడిమెట్ల బస్‌డిపో వద్ద ఇతర రాష్ట్రాల కార్మికులు ఇక్కడికి వస్తున్నడంతో సాక్షి కెమెరాకు చిక్కింది.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్‌

కుత్బుల్లాపూర్‌: నిరుపేదలకు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ ఎంతగానో ఉపయోగపడుతుందని, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్‌ విప్‌, ఎమ్మెల్యే వివేకానంద్‌ అన్నారు. నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్యమంత్రి సహాయ నిధి దరఖాస్తుదారులకు మంజూరైన రూ. 4.30 లక్షల విలువ గల మూడు ఎల్‌ఓసీలను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ గాజుల రామారం డివిజన్‌ అధ్యక్షులు విజయ్‌ రాంరెడ్డి, సీనియర్‌ నాయకులు కుంట సిద్ధిరాములు, నదీమ్‌ రాయ్‌, ఇబ్రహీం బేగ్‌, అడ్వకేట్‌ కమలాకర్‌, మూసాఖాన్‌, బోయిని మహేష్‌, సంధ్యా రెడ్డి, శ్రీదేవి రెడ్డి, యాదగిరి, జునైద్‌ పాల్గొన్నారు.

పారిపోయిన బాలికలను సఖీ సెంటర్‌కు అప్పగించిన పోలీసులు

సుభాష్‌నగర్‌: సఖీ సెంటర్‌ నుంచి పారిపోయిన ఇద్దరు బాలికలను తిరిగి సెంటర్‌కు అప్పగించిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజీవ్‌గాంధీనగర్‌లోని సఖీ సెంటర్‌లో ఉంటున్న ఇద్దరు బాలికలు ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో సెంటర్‌ నుంచి పారిపోయారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీఐ భరత్‌కుమార్‌ ఆధ్వర్యంలో బాలికలను పట్టుకునేందుకు ఎస్‌ఐ కిషన్‌ నేతృత్వంలో స్పెషల్‌ టీం బృందాన్ని ఏర్పాటు చేశారు. గురువారం చింతల్‌ ఏరియాలో సదరు బాలికలను స్పెషల్‌ టీం సభ్యులు గుర్తించి వారిని సఖీ సెంటర్‌ నిర్వాహకులకు అప్పగించారు. సఖీ సెంటర్‌ నుంచి నింబోలిఅడ్డ హోమ్‌కి పంపించారు.

నో చాన్స్‌!

- టీపీసీసీలో నియోజకవర్గం నుంచి ఏ ఒక్కరికీ దక్కని చోటు
- గతంలో నలుగురికి అవకాశం
- నిరుత్సాహంలో కాంగ్రెస్‌ శ్రేణులు



కుత్బుల్లాపూర్‌: ఒక్కరికీ అవకాశం దక్కలేదు.. పార్టీ కోసం పని చేసిన ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కాంగ్రెస్‌ పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు. తెలంగాణ ప్రదేశ్‌ కాంగ్రెస్‌ కమిటీ ప్రకటించిన జాబితాలో కుత్బుల్లాపూర్‌ ప్రాంతానికి చెందిన ఏ ఒక్కరికీ అవకాశం కల్పించకపోవడంపై గుర్రుగా ఉన్నారు. గతంలో కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గం నుంచి టీపీసీసీ కార్యవర్గంలో కొలను హనుమంత్‌రెడ్డి, పున్నారెడ్డి, నర్సారెడ్డి భూపతిరెడ్డి, జ్యోత్స్నారెడ్డి ఇలా నలుగురిని ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. ఆ సందర్భంలో సైతం విమర్శలు వచ్చినప్పటికీ పార్టీలో బలమైన నాయకులు లేక పోవడంతో పార్టీ పటిష్టత కోసం మండలాలు గ్రేటర్‌ పరిధిలో ఉన్న వారికి అవకాశం కల్పిస్తూ వచ్చారు. తాజాగా కాంగ్రెస్‌ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వీరు కార్పొరేషన్‌ పదవులు వస్తాయని, లేదా పార్టీ పదవులు ఇస్తారని ఎంతో ఆశతో ఎదురు చూశారు. చివరకు కార్యవర్గం ప్రకటించిన ఈ ప్రాంతానికి చెందిన ఏ ఒక్కరి పేరు లేకపోవడంపై ఆశ్చర్యపోయారు. జోత్స్నారెడ్డి మాత్రమే రాష్ట్ర స్థాయిలో డైరెక్టర్‌ పదవి వరించింది. మిగతా వారికి టీపీసీసీ ప్రకటించిన కార్యవర్గంలో అవకాశం కల్పించకపోవడంతో క్యాడర్‌ నిరుత్సాహంలో ఉన్నారు.

- బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన కూన శ్రీశైలంగౌడ్‌ బీజేపీకి గుడ్‌బై చెప్పి సొంతగూటికి చేరుకున్నారు. రేవంత్‌ రెడ్డి ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించి కీలక బాధ్యతలు అప్పగిస్తారని అందరూ ఆశించారు. గతంలో ఎంపీ ఎన్నికల్లో రేవంత్‌ రెడ్డి గెలుపునకు అన్ని తానై వ్యవహరించిన కూన శ్రీశైలంగౌడ్‌ నాటి సన్నిహిత్యంతో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఆయనకు కూడా కార్యవర్గంలో చోటు దక్కలేదు.